క్లుప్తంగా

అలరించిన ఘంటసాల ఆపాత మధురాలు



తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాస సమావేశం ఆదివారం సాయంత్రం అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. శ్రీ షిరిడి సేవా సమితి అధ్యక్షుడు, మధురగాయకుడు వెంపటి సత్యనారాయణ ఘంటసాల ఆపాత మధురాలను గానం చేశారు. సభ్యులను అలరించారు. సహజ కవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం వీరిద్దరిని నిర్వాహకులు సత్కరించారు. ముందుగా గత నెలలో మృతిచెందిన సభ్యులకు నివాళులర్పించారు. కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

తెనాలిటౌన్: పట్టణంలోని కొణిజేటి రోశయ్య రోడ్డులోని మున్షీ మస్తాన్ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ సాతులూరి రాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకుడు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం పుట్టిన రోజు సందర్భంగా వారి సహకారంతో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ కడియాల పల్లవి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిటౌన్: పట్టణంలోని సుల్తానాబాద్, సుందరయ్యనగర్, జేఎంజే కళాశాల ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ బి.అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ పద్మనాయక వెలమ యువత రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు, కృష్ణా జిల్లాల వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ కో–ఆర్డినేటర్ జలగం రామకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో తెనాలి రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం దివ్యాంగులు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తట్టుకూర్తి అశోక్‌యాదవ్, కొమ్ము భిక్షాల్ రాయల్, బొమ్మి నాగిరెడ్డి, షేక్‌మీరావలి, వాసు, పెనర్లంక రమణ, ఎల్‌టీసీ చిన్ని పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



తెనాలిటౌన్: రోటరీ క్లబ్ సహకారంతో మున్సిపల్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న క్లబ్ కార్యాలయ ఆవరణలో 108 మంది విద్యార్థినిలకు సైకిళ్లు అందజేశారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలు, కఠెవరం, బుర్రిపాలెం, దుగ్గిరాల మండలం ఈమని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జీవీ నారాయణ, ఈదర శ్రీనివాస్, గుమ్మడి ప్రసాద్, వల్లూరి వెంకటేశ్వరరావు, కాకుమాను ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. జూదరులను అదుపులోకి తీసుకుని పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. పట్టణ సుల్తానాబాద్‌లోని ఓ ఇంట్లో పేకాట శిబిరంపై త్రీ టౌన్ ఎస్‌ఐ ఎం.విజయ్‌కుమార్, సిబ్బంది ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.72,050 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అసంఘటిత కార్మికుల రక్షణ కవచం 'ఈ–శ్రమ్'

కార్మికశాఖ ఉప కమిషనర్ . ధూళిపూడి వెంకట శివప్రసాద్



గుర్తింపు కార్డులు అందజేస్తున్న శివప్రసాద్, డాక్టర్ యశోధర

తెనాలి: అసంఘటిత కార్మికులకు ఈ–శ్రమ్ గుర్తింపు కార్డు రక్షణ కవచమని కార్మికశాఖ గుంటూరు జిల్లా ఉప కమిషనర్ ధూళిపూడి వెంకట శివప్రసాద్ అన్నారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (మా–ఏపీ) ఆధ్వర్యంలో స్థానిక సుల్తానాబాద్‌లోని రత్న పార్‌చ్యూన్ కల్యాణ మండపంలో ఏర్పాటైన ప్రత్యేక సభలో కార్మికులకు అక్కడికక్కడే రిజిస్ట్రేషన్ చేసి, 'ఈ–శ్రమ్' గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. సభలో మాట్లాడుతూ గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తి అనుకోకుండా ఏదైనా ప్రమాదానికి గురైతే బీమా వర్తిస్తుందని చెప్పారు. మరణిస్తే రూ.2 లక్షలు, గాయపడితే రూ.లక్ష బీమా పరిహారంగా అందుతుందని చెప్పారు. ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్నా, గుర్తింపు కార్డులో నమోదైన వివరాలను ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందని చెప్పారు. అసంఘటిత కార్మికులంతా ఈ–శ్రమ్ కార్డులను పొందాలని సూచించారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎం.వినయ్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కరోనాతో మరణించిన కార్మికుల వివరాలను ప్రభుత్వానికి అందజేసినట్టు చెప్పారు. ఆయా కుటుంబాలకు సాయం అందుతుందని తెలిపారు. అధ్యక్షత వహించిన మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతిఒక్కరికీ బీమా సౌకర్యం తప్పనిసరిగా అవసరమని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఈ–శ్రమ్ గుర్తింపుకార్డులతో అసంఘటిత కార్మికులు బీమాను పొందాలని కోరారు. తొలి కార్డును కొలకలూరు కాల్వకట్టపై చెత్తకాగితాలు ఏరుకునే గిరిజనులు చెలమచెర్ల శ్రీను, రాహేలమ్మకు అందజేశారు. మా–ఏపీలో 24 విభాగాల సాంకేతిక నిపుణులతోపాటు మొత్తం 235 మంది అసంఘటిత కార్మికులకు ఉప కమిషనర్ వెంకట శివప్రసాద్, డాక్టర్ యశోధర గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్మికశాఖ అధికారి మొహబూబ్ సుభాని, ముంబయి నటి శ్యామ, బెల్లంకొండ వెంకట్, కామన్ సర్వీస్ సెంటర్ టెక్నీషియన్లు శివనారాయణ, పార్థసారథి, సాయిలత, శివశంకర్ పాల్గొన్నారు. మా–ఏపీ సంయుక్త కార్యదర్శి మిలటరీ ప్రసాద్ పర్యవేక్షించారు.

27న జగన్నాథస్వామి రథయాత్ర



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన సింహ గౌరదాస్

తెనాలి: పట్టణంలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 27న శ్రీ జగన్నాథస్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు శివాజీచౌక్ నుంచి ఆరంభమయ్యే రథయాత్రలో స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఇస్కాన్ ముంబయి ఉపాధ్యక్షుడు శ్రీమాన్ ముకుంద మాధవదాస్, రష్యాకు చెందిన ఇస్కాన్ భక్తులు పాల్గొంటారు. పట్టణ నాజరుపేటలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి సింహ గౌర దాస్ ఆహ్వానపత్రికను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. పట్టణ వీధుల్లో సాగే రథయాత్ర రాత్రి 7 గంటలకు బోసు రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటుందని తెలిపారు. అక్కడ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. వివిధ దేశాలకు చెందిన కళాకారులు పాల్గొనే రథయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రథయాత్ర అనేది కృష్ణుడిని మన హృదయాల్లోకి తీసుకొచ్చేందుకు చేసే ధ్యానంగా సింహ గౌరదాస్ వెల్లడించారు. ఆధ్యాత్మిక జీవితం నిజమైన ఉద్దేశమేమంటే, దేవుడు తనను తాను మనకు బహిర్గతం చేయటానికి మన హృదయాన్ని తగిన నివాసంగా మార్చటమని, అంటే అది శుభంగా ఉండాలేగానీ, కామం, అసూయ, అహంకారం, దురాశ, కోపం, భ్రాంతి అనేక మురికి పేరుకుపోరాదని చెప్పారు. భగవంతుడిని స్మరించుకుంటూ మన హృదయాల్లోకి ఆహ్వానించాలనే ఉద్దేశంతోనే రథయాత్ర మహోత్సవాన్ని ఏటా తెనాలిలోని ఇస్కాన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీజగన్నాథ రథయాత్ర జగన్నాథ్ పూరీలో శతాబ్దాలనాటి నుంచి జరిగే వేడుకగా చెప్పారు. కృష్ణుడు (జగన్నాథ్), అతని సోదరుడు, సోదరి (బలరామ, సుభద్ర)తో కలిసి అతని లీలాప్రదేశం అయిన బృందావనానికి తిరిగివచ్చే సందర్భంగా జరుపుకుంటారని గుర్తుచేశారు.

మహాత్మా ఆశ్రమంలో పండ్లు పంపిణీ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో ఆదివారం వృద్ధులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన మంచికలపూడి రాఘవులు, మహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వీటిని పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు రామలింగాచారి ఆశ్రమ నిర్వాహణకు దాతలు సహకరించాలని కోరారు. కుటుంబ సభ్యులు మంచికలపూడి వెంకటేశ్వరరావు, విజయ, ఆశ్రమ నిర్వాహకులు యార్లగడ్డ కోటేశ్వరరావు, రామయ్య శాస్త్రి, చుక్కా శ్రీనివాస్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా ఆశ్రమంలో శాంతి జపం

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో ఆదివారం గాంధీ శాంతి జపం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి ప్రతి రోజు ఆశ్రమంలో జపం చేస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి చెప్పారు. రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం వల్ల నష్టం ఎక్కువ జరుగుతుందని, త్వరలోనే యుద్ధ విరమణ జరగవచ్చని పేర్కొన్నారు. ఈ క్రమంలో శాంతి జపం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యుద్ధం విరమించాలని కోరుతూ భగవంతుని ప్రార్థించాలన్నారు.

యర్రబాలెంలో రూ.500 నకిలీ నోటు కలకలం



మంగళగిరి: ఇటీవల మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నకిలీ నోట్లు చలామణి అవుతుండటంతో వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. రద్దీగా ఉండే దుకాణాలు, హోటళ్లు, సూపర్ మార్కెట్లతో పాటు పలు పెట్రోలు బంకుల్లో నకిలీ నోట్లను కొందరు చలామణి చేస్తూ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. తాజాగా కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో ఆదివారం ఆంథోని మటన్ షాప్ నిర్వాహకురాలికి ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ.500 నకిలీనోటు ఇచ్చి మటన్ తీసుకుని వెళ్లిపోయాడు. వ్యాపారం ముగిసిన అనంతరం నగదు లెక్కించే క్రమంలో మటన్ దుకాణం నిర్వాహకురాలి కుమారుడు శ్రీకాంత్ రూ.500 నోటు నకిలీదిగా గుర్తించాడు. గత ఆదివారం కూడా ఓ గుర్తు తెలియని వ్యక్తి మటన్ తీసుకుని ఇచ్చిన నగదులో రూ.100 నకిలీనోటు వచ్చిందని వాపోయాడు.

తాడికొండ, కంతేరులో కొనసాగుతున్న పోలీస్ పికెట్



తాడికొండ: కంతేరు గ్రామంలో ఇరువర్గాలకు చెందిన యువకులు దాడులు చేసుకున్న నేపథ్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతుంది. దళిత సంఘాలు పోలీస్ స్టేషన్‌కు ముట్టడి స్తామని ప్రకటించిన నేపథ్యంలో తాడికొండ పోలీస్ స్టేషన్, కంతేరు గ్రామంలో పికెట్ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శతాధిక వృద్ధురాలి సంస్మరణ సభ

హాజరైన ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు



శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొలకలూరు(తెనాలి): తెనాలి రూరల్ మండల గ్రామం కొలకలూరుకు చెందిన శతాధిక వృద్ధురాలు ఉన్నం ఆనందమ్మ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ దంపతులు, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరై ఆనందమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ ఏపీపీలు సుద్దపల్లి సుకుమార్, పరిశపోగు సునీల్, గుంటూరు, నరసరావుపేట ఏపీపీలు మురళి, విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి న్యాయ సలహాదారు గుంటూరు కృష్ణ, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, వైసీపీ సీనియర్ నాయకులు సుద్దపల్లి నాగరాజు, వ్యవసాయ శాఖ ఏడీలు అమలకుమారి, ప్రవీణ, జాస్మిన్, విజయవాడ ఆర్టీసీ డిప్యూటీ డీజీఎం (ఫైనాన్స్) సుధాకర్, విశ్రాంత తహసీల్దారు రామారావు, యోహాను, కుమారులు ఉన్నం లక్ష్మయ్య, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (కర్నూలు) ఉన్నం యెహెజ్కేల్, ఫిజికల్ డైరెక్టర్ ఉన్నం రాజకుమార్, కుటుంబసభ్యులు ఉన్నారు.

వస్త్ర ఉత్పత్తి కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

నేతనాడు రాష్ట్ర అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నేతనాడు రాష్ట్ర అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు

మంగళగిరి: వస్త్ర ఉత్పత్తి కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని నేతనాడు రాష్ట్ర అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు అన్నారు. నేతన్నల సామాజిక న్యాయ పాదయాత్ర ప్రారంభం సందర్భంగా నగరంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలీ, దేవాంగ, తొగటవీర, క్షత్రియ, కర్ణిబత్తుల, తదితర వస్త్ర ఉత్పత్తి కులాల వారిని ఐక్యం చేయాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. వస్త్ర ఉత్పత్తి కులాలకు 15 అసెంబ్లీ సీట్లు, నాలుగు మంత్రి పదవులు, మూడు లోక్‌సభ సీట్లు, రెండు రాజ్యసభ సీట్లు, 10 ఎమ్మెల్సీలతో పాటు స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాదయాత్ర వస్త్ర ఉత్పత్తి కులాలు సంఖ్యా బలం ఉన్న నియోజకవర్గాల్లో కొనసాగుతుందని, ఒక్కో నియోజకవర్గంలో వారం నుంచి పది రోజుల పాటు డిసెంబరు 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు, రామనాథం వెంకటేశ్వరరావు, కొసనం సాంబశివరావు, దీపాల కావేరి, గుంటి ప్రతాప్, గోట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రగడ నవదుర్గా ప్రసాద్, జింకా రఘువీర్, జింకా రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులను చేర్పించేందుకు యూటీఎఫ్ ప్రచారం



ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం కరపత్రాలను విడుదల చేస్తున్న ఆదిలక్ష్మి, కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం పేరుతో ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా, మండల కమిటీల సభ్యులు జిల్లా వ్యాప్తంగా ఆవాస ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, తల్లిదండ్రులను కలిసి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో సహజ సిద్ధ వాతావరణంలో మనోవికాస అభివృద్ధితో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలలకే సాధ్యమన్నారు. పాఠశాలలను కాపాడుకునే బాధ్యతలను తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు స్వీకరించినప్పుడు ప్రభుత్వ బడులకు ప్రత్యామ్నాయం ఉండదని అన్నారు. ఆ విధంగా కృషి చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గురుబ్రహ్మం, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం జరగనుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10గంటల నుంచి 1గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో స్పందన ఉంటుందని స్థానికంగా పరిష్కారం కానీ సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అసాంఘిక కార్యకలాపాల్లో ప్రమేయం..ఉపేక్షించం

పాత నేరస్తులకు త్రీ టౌన్ సీఐ హెచ్చరిక



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: పాత నేరస్తులు అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే సహించేది లేదని త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్కోటిక్, గంజాయి కేసుల్లో ముద్దాయిలు, రౌడీషీటర్లు, నేరస్తులకు ఆదివారం సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో వారు చేసిన నేరాలు, ప్రస్తుత వృత్తి, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుపై నిఘా ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినా ముందుగా వారినే విచారించాల్సి ఉంటుందన్నారు. అనంతరం సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో రాత్రిళ్లు యువకుల సంచారం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. రాత్రి 11 గంటల అనంతరం అనవసరంగా రోడ్ల మీదకు వచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మద్యం, గంజాయి తాగి రోడ్లపై తిరుగుతున్నట్టు సమాచారం వస్తోందని ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. సీఐ వెంట ఎస్‌ఐ ఎం.విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న బాపట్ల డీఆర్వో శివజ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు

తెనాలిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి గొప్పగా ఎదగాలని బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి కోరారు. ముత్తెంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రశంసా పత్రాలు అందజేశారు. సభకు ట్రస్ట్ చైర్మన్ ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షత వహించారు. సభలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాసులు(విజయవాడ) మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో విద్యను అభ్యసించి స్వయం కృషితో ఎదగాలని తెలిపారు. విశ్రాంత అధ్యాపకులు జొన్నాదుల నరసింహారావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ట్రస్ట్ చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ఆరు మున్సిపల్ పాఠశాలలో గతేడాది పదోవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు. ట్రస్ట్ ద్వారా 120మందికి నోట్ బుక్స్, స్టేషనరీ, దుస్తులు ముఖ్య అతిథులు అందజేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన డాక్టర్ జాస్తి వెంకట సుబ్బారావు దంపతులు, సాధనాల కేశవరావు, కోన వెంకట నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పావని ప్రియాంక, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, కోశాధికారి సాంబ్రాజ్యలక్ష్మి, సినీ గేయ రచయిత వీరేంద్ర ప్రసాద్, ఎన్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, వెంకట శివశంకర్, రమాదేవి, భానుమతి, కొమ్మూరి మోహనరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంపై అపోహలు వద్దు

పౌరసరఫరాల శాఖ డీటీ దుర్గారావు

మంగళగిరి: అందరికీ మెరుగైన ఆరోగ్యం కోసం బలవర్ధక(ఫోర్టిఫైడ్) బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని, రేషన్ బియ్యంపై ప్రజలు ఎటువంటి అపోహలు చెందవద్దని పౌరసరఫరాల శాఖ డీటీ దుర్గారావు అన్నారు. రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఆనవాళ్లు అంటూ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో కథనాలు రావడంతో ఆయన స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా మొబైల్ వాహనాలు వినియోగించి కార్డుదారులందరికీ పోషక బియ్యం ఇంటి ముంగిట పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఫోర్టిఫైడ్ బియ్యం వండటానికి ప్రత్యేక వంటక విధానాలు అవసరం లేదని, సాధారణ బియ్యాన్ని ఎలా కడిగి శుభ్రం చేసుకుంటారో అదే విధంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కడిగి శుభ్రం చేసుకోవాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కడిగే సమయంలో ఒకవేళ బియ్యపు గింజలు నీటిపై తేలినట్లయితే వాటిని తీసివేయరాదని, గంజి తీయకుండా ఉడక నివ్వాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం అత్యుత్తమ పోషకాలతో కూడిన బియ్యం అని, ఆహారం యొక్క నాణ్యతను పెంచడానికే లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అన్ని వయసుల కలిగిన వారు వండుకుతిని మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని డీటీ దుర్గారావు తెలిపారు.

విజయకీలాద్రిపై అరుణహోమం



అరుణ హోమం నిర్వహిస్తున్న జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం అరుణ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనాలతో ఆషాఢ మాసం సందర్భంగా ఉదయం 9 గంటలకు సూర్య భవానునికి అరుణ హోమం నిర్వహించినట్లు చెప్పారు. అరుణ హోమం సమస్త జీవకోటికి ప్రాణశక్తిని, వెలుగుని ప్రసాదించే సూర్యభవానునికి ప్రీతికరమని అన్నారు. వేదంలోని ఆరణ్యక భాగంలో ఉన్న 132 సూర్య మంత్రాలను ఉపాసిస్తూ ఆయల అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు హోమాన్ని పూర్తి చేశారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ అరుణ హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వివరించారు.

ఘనంగా వారాహి నవరాత్రులు

ఈ నెల 28న పూర్ణాహుతి

పాత గుంటూరు: శ్రీనగర్ 6వ లైనులోని లలితా పరమేశ్వరి దేవస్థానంలో రాజశ్యామల పీఠం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో కనుల పండుగగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్ర నామార్చనలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అమ్మవారి మూలమంత్రంతో వారాహి హోమం వేదోక్తంగా చేసారు. గణపతి, దుర్గ మంత్రాలతో హోమం జరిపారు. పీఠ వ్యవస్థాపకులు వెలమకన్ని నాగార్జున శర్మ మాట్లాడుతూ ఈ నెల 28 తేదీ పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సందీప్ శర్మ, వల్లూరి హనుమత్ సాయి, సన్నిధానం వ్యాసనారాయణ, అభిషేకాలు హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

యువకుడిపై ఇనుప రాడ్‌తో దాడి

చేబ్రోలు: స్వల్ప విషయంలో యువకుడిపై ఇనుపరాడ్‌తో దాడి చేయటంతో తలకు గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చీలిపాలెం ప్రాంతానికి చెందిన ముళ్లపూడి అశోక్‌పై అదే ప్రాంతానికి చెందిన పద్మరాజు మరికొంతమంది కలసి దాడి చేసి గాయపరిచినట్లు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేశారు.

కంతేరు దాడిలో ఆరుగురికి రిమాండ్

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలోని ఎస్సీ యువకులపై దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ రాంబాబు తెలిపారు. ప్రధాన నిందితుడు కళ్ళం మనోహర్ రెడ్డితో పాటు సంబూరు గ్రామానికి చెందిన జొన్నల సందీప్ రెడ్డి, అన్నపురెడ్డి సాయి కృష్ణారెడ్డి, కరాటి నాగేంద్ర బాబు, భీమవరపు మణిదీప్ రెడ్డి, ధనికొండ నరసింహారావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



గుంటూరు రూరల్: నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ప్రముఖ సినీనటుడు, హీరో సుమన్ తెలిపారు. ఆదివారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో ఇటీవల రాష్ట్ర నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైన కవులూరి పీర్ మొహ్మద్‌ను శివసేన మిత్రమండలి ఆధ్వర్యంలో సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు. సుమన్ మాట్లాడుతూ పీర్ మహమ్మద్ మరిన్ని ఉన్నత పదవులకు ఎదగాలని ఆకాంక్షించారు. అదే విధంగా సంఘ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. డాక్టర్ కృష్ణశ్రవంత్ మాట్లాడుతూ మహమ్మద్ సంఘ అధ్యక్షులుగా ఎన్నికైనందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. తోట శ్రీనివాస్, కృష్ణశ్రవంత్, నీలిమ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ చెన్నంశెట్టి వెంకటశివ, పేరం నగేష్, శివ సేన మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.